CP035159

T. T. D. Religious Publication Series No. 49

11408

# మతము - భౌతికశాస్త్రము

C

రచయిత :
ఆర్ష విద్యాలంకార
శ్రీ కల్లూరి చంద్రమౌళి.

530.01
C45

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు
శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్., గారిచే
ప్రకటింపబడినది
1980

**Subsidised Price : 0—50 Paise only.**

సత్యము సర్వోత్తమ ధర్మము

అకారణ కోపము అనర్థ హేతువు

తొందరపడి ఏ పని చేయరాదు

వివేకధైర్యములే విజయ హేతువులు

అతిగర్వము హానికరము

మహాత్ములను అవమానించుట అపచారము

సత్ప్రయత్నము వీడరాదు

వాగ్దోషము ప్రాణహాని కారణము

క్షమ సర్వకార్య సాధనము

భగవంతుడు భక్తివశ్యుడు

ఆత్మస్తుతి పతనకారణము

ఆడి తప్పరాదు

దేవుని దూషించుట మహాపచారము

AP03S159

# మతము - భౌతికశాస్త్రము

రచయిత :

ఆర్ష విద్యాలంకార

శ్రీ కల్లూరి చంద్రమౌళి

HIMAMBU BOOK DEPOT
Phone : 4180
WIDE RANGE OF BOOKS,
VIZIANAGARAM-531 202

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్. గారిచే

ప్రకటింపబడినది.

1980

MATHAMU - BHOWTHIKASASTHRAMU
(Second Edition)

T. T. D. Religious Publication Series No. 49.

Subsidised Price : 0–50 Ps.

*Published by:*
Sri P. V. R. K. Prasad, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati—Copies 10,000.

ఓం

# దివ్య ప్రసాదము

* * *

అన్నమో రామచంద్రా యని ఆకటి చిచ్చుతో ఆక్రందనములు గావించుచున్న నిరుపేదల దారిద్ర్యమును సత్వరముగ నిర్మూలింప ప్రభుత్వమొకవంక గట్టిగ కృషి సల్పుచుండ – మఱియొకవంక కుచ్ఛితులు తమ స్వార్థమును జక్కబెట్టుకొన పడరానిపాట్లు పడుచున్నారు; ధనార్జనకై అవినీతిని, లంచగొండితనమును ప్రబల వ్యాప్తమొనర్చుచున్నారు. అట్టి స్వార్థపరుల దుశ్చర్యల నఱికట్టి, నయశీలముల సుస్థాపితము గావింపవలెను. శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గము ఇట్టి కృషికి గడంగ నిర్ణయించుకొన్నది. ఇటువంటి సేవల నొనర్చుటకు మమ్ములను సభ్యులుగ నియమించిన ఆంధ్రప్రాంత ప్రభుత్వ ముఖ్యమంత్రి డాక్టరు గౌ॥ శ్రీ నీలం సంజీవరెడ్డిగారికి సహకారపురస్సరముగ – హృదయపూర్వకముగ సమర్పింపబడిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యప్రసాదము.

Blank Page

# "భవ్య భావన"

బృందావనం రంగాచార్యులు.

మనుగడను మంగళప్రదముగ జీవించుకొనుటకు మహనీయములైన మార్గములున్నవి. మమకారముల కతీతమైన దివ్యాలోచనతో మానవ జీవితలక్ష్యమును నిర్దేశింప నహరహము పరిశ్రమించిన పవిత్రభావనులు గలరు. వారి యూహాలలో విశ్వకల్యాణమునకు పసిడిబాటలు గన్పట్టును. వారి యడుగుజాడల ననుసరించి పయనము సాగించుచో — ధ్యేయము ఫలించుట, శ్రేయము లభించుట తథ్యము.

విద్య — మానవునిలో నవచైతన్యమును — ప్రవిమలతార్కిక దృక్పథమును — సదసద్వివేకశక్తిని గలిగించుచుండ; తద్వ్యక్తులకు పవిత్రతను జేకూర్చి — నరుని అమరునిగ నొనరింప ఆధ్యాత్మిక భావన దోహదముగ నిల్చును.

ఇట్టిభావన మనహృదయకుహరముల — సుస్థిరముగ సుప్రతిష్ఠితమగుటకు, వలయు సౌకర్యముల నన్నింటిని జ్ఞానసముద్రులగు మహాత్ములు సంసిద్ధపఱచియే యుండిరి. తదవసరమును సైతము వారు ముక్తకంఠమున ప్రబోధించిరి. ఆ ప్రబోధ వాఙ్మయమే — మానవ కర్తవ్యతా సూచకమగు మన ఆర్ష సాహిత్యసంపదయంతయు, ఇందలి ప్రతిభ మన భారతీయుల భావనలకే కాక; ప్రపంచ ప్రజల సంకల్పములకే మంచి అంతస్సును బెంచు సామర్థ్యము గలిగినట్టిది.

యుగయుగములనుండి – తరతరాలుగా – భిన్న భిన్న కాలములలో – స్వదేశవిదేశములకు జెందిన విద్వన్మూర్తులచే బహుళప్రచార ప్రశంసలనందుకొన్నది మనవేదమతసాహిత్యము.

దివ్య తపోనిరతులై – లోక క్షేమమును గాంక్షించి; దైవదత్తములైన: వేదధర్మములను బ్రసారమొనరింప గంకణమూనిన యోగిపుంగవుల ఆత్మ బలప్రభావము వలననే – మన మతమున కీ స్థాయి లభ్యమైనది.

మానవధర్మ విజ్ఞానమును గురించియు; పరతత్త్వమును గురించియు; ప్రవిమలాధ్యాత్మిక బలమును గురించియు; పునః పునః ప్రబోధములు లోకమున నవిరళముగ వ్యాప్తిగాంచుచుండు టెంతయు ముఖ్యము.

అట్టి దృష్టితో జీవిత సాఫల్యమును గూర్చి నిర్దుష్టముగ నిర్వచించెడి — "మతము—భౌతిక శాస్త్రము;" అనెడి గ్రంథమును తిరుమల తిరుపతి దేవాలయ పాలకవర్గమువారు పాఠకలోకమునకు సమర్పించుచున్నారు.

ఆధ్యాత్మిక భావ పునరుజ్జీవనావసరమును వేనోళ్ళజాటిన ప్రముఖ భారతీయ పండితుల వాక్యములు – ఈ సిద్ధాంతమునగల సత్యమును గుర్తించి; యభినందించిన పాశ్చాత్య కోవిదుల పలుకులు;– సందర్భానుసారముగ సమీకృతములై యుపనిషన్మత ప్రాధాన్యమును మరొకసారి యీ గ్రంథ రూపమున బలపరచినవి.

ఈ వాక్యములను తన భావనలకుద్దీపకములుగ నుదహరించుచు – రచయిత శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు వివిధ దృక్కోణములలో పవిత్ర మతధార్మిక సిద్ధాంత ప్రత్యేకతను మంజుల ధోరణిలో యిందు ప్రవచించిరి.

సమర్థ సద్గురువుల సాన్నిధ్యమున జక్కగ భారతీయ సంస్కృతీ సాహిత్యముల ఆనుపానులు గుర్తించిన కోవిదులుగా – శాంతిదూతయగు బాపూజీ మార్గమున మమతతో జరించెడి మాతృదేశభక్తులుగా – శ్రీ చంద్రమౌళిగారు సర్వులకు సుపరిచితులు. రామాయణముపై మధురవివరణ "సుధాలహరి" పేర సంతరించుటతో వీరి ఆర్ష విజ్ఞాన పరత యితఃపూర్వమే లోకమునకు సువిదితము.

ఇట్టివారు దేవాలయ పాలకవర్గాధ్యక్షులై యుండుటయు;– యావద్భారత ప్రజలకేడుగడయు – సమస్తమానవకోటి కారాధ్యమూర్తియు నగుచు విరాజిల్లు తిరుమల తిరుపతి శ్రీనివాస ప్రభువు దేవాలయ పక్షమున నిట్టి గ్రంథము ప్రచురింపబడుటయు; హర్షణీయము.

పవిత్రమైన మతధర్మ ప్రబోధక సాహిత్యమును – ప్రతి మాసము వెలువరింప దలపెట్టిన దేవాలయ పాలకవర్గాధికారుల "భవ్య భావన" ఆధ్యాత్మిక రంగమునకే శుభోదర్కమైన యంశము.

సమర్థుల సంకల్పమున స్వర్ణరూపముదాల్చిన యీ యుద్యమము పుష్పించి ఫలించుటే కాక యావద్భారత దేవాలయములకు సాహిత్యరంగమున మార్గదర్శకమగు గాక. శ్రీ వేంకటేశ్వర స్వామివారి పరిపూర్ణానుగ్రహము సర్వధా సమగ్రముగ సమకూరు గాక.

శుభం భూయాత్.

*

# మతము — భౌతికశాస్త్రము

ఆధునిక కాలమున భౌతికవాదము విశ్వవ్యాప్తమగుచున్నది. ధనికవాదము తల యెత్తుచున్నది. అదనుజూచి నాస్తికవాదము గూడ కాలు కదుపనుంకించుచున్నది. 'భౌతిక శాస్త్రములు విశ్వసనీయములు. సాంకేతిక విజ్ఞానము సంపదల కాకరము. భోగమయ జీవితము వాంఛనీయము.' అను ప్రచార ప్రబోధములు బాహాటముగ సాగుచున్నవి. 'భక్తి శ్రద్ధలను ప్రారద్రోలుదము. ధార్మిక విశ్వాసములను వెనుకకు నెట్టుదము. మనోబద్ధహేతువునకు పదిలముగ పట్టముగట్టుదము.' అని నేడు పలుకుట పరిపాటియైనది. 'దేశాభివృద్ధికి, మానవుల యున్నతికి, భౌగోళిక వైభవ పరంపరకు భౌతికశాస్త్రమే పునాది. అర్థకామము లాయువు పట్టులు. ఇవి మానవుల సర్వతోముఖ వికాసమునకు ముఖ్యములు. మూలస్తంభములు' అని పాశ్చాత్యులు పెడబొబ్బలిడుచున్నారు. చూడుడు!

'రాజకీయ రంగములలో, వర్తక వ్యాపారశాలలలో, శాస్త్రపరిశోధనాలయములలో, చర్చా వేదికలలో, విశ్వవిద్యాలయములలో, విద్వత్ పరంపరలో, కర్మాగారములలో, సాంఘిక సంస్థలలో, సారస్వత వ్యవసాయములలో మతమునకు స్థానముండ జనదు' అని భగవంతు నొకమూలకు నెట్టి, అదియే నీ స్థానము, ప్రపంచము మాకు సంబంధించినది అను దురహంకారముతో విఱ్ఱవీగుచున్నారు. 'మేమే విద్యాధికులము, నాగరి

కులము, ఉన్నతపథగాములము, ఉత్తమ భావుకులము' అని మన దేశీయులు కొందఱు పాశ్చాత్యుల వాదమునే ప్రతిధ్వనింప జేయుచున్నారు. వారికి ప్రతిబింబములై మనుగడ సాగించుచున్నారు. అందులవలె వారి యడుగుజాడల ననుగమింప నువ్విళ్ళూరుచున్నారు. ఇట్టి వికృత భావావేశపరులకు మతములు గిట్టవు. వారి దృష్టిలో మత సహనము అర్థరహితము, అవాంఛనీయము నగు వైఖరియే. నిరూఢములై, నిరుపమానములై, నిగమచోదితములై వెలుగొందెడి నిర్ణయములపై, నిశ్చలముగ నిలిచియున్న మన జీవితవ్యవస్థకు భిన్నముగ మత రహితమైన సంఘమును స్థాపించుటకై వీరు నిత్యము కలలు గనుచున్నారు.

'భగవంతుడు లేడు. ఆస్తిక్య మర్థరహితము. హేతు బద్ధమైనదే విజ్ఞానము. ఉద్దీపన మూహాగానము' అని నాస్తికత్వ మును స్థాపింప సన్నద్ధు లగుచున్నారు.

మన ఇంద్రియములకు గోచరమగు ప్రపంచము పరిమితము. ఇది పరతంత్రము. సాపేక్షికము, చంచలము. దీని కతీతము — అగోచరము — ఆశ్రయము నగు స్వతస్సిద్ధమైన యునికియు, స్వయంప్రకాశమైన జ్ఞానమును, అమరమైన జీవనమును, నిరవధికమైన యానందమును గలవు. దివ్య చక్షువులతో తిలకించి యోగి పుంగవులందజేసిన ఆర్ష సుధాసారమిది. భౌతికమునుండి భౌతికము - జడమునుండి జడము నుద్భవింపజాలవు. ఇట్టి భావము అశాస్త్రీయము, అహేతుకము. సర్వము నందు లీనమై, దాని

కతీతముగ వెలుగొందెడి యొక చైతన్యము—దివ్యశక్తి యుండి తీరవలెను. భగవంతుడే లేకపోయినచో, జీవితము మూడునాళ్ళ ముచ్చటేయైనచో, మన యాశయములకు, అనుభవములకు, విజ్ఞాన వికాసములకు, అభివృద్ధికి అర్థమేమి? చరాచర జగన్మం గళ భంగిమలకు—భంగములకు—హేతుభూతమగు శక్తి యెద్ది? వీని పూర్ణత్వ మెక్కడ? స్థాయి ఎక్కడ? సార్థక్య మెక్కడ? లౌకిక జీవితమునకు మించిన దివ్యశక్తియే లేకపోయినచో, భౌతిక విషయ భోగమే మన జీవిత పరమావధి యైనచో ఒకరి నొకరు ప్రేమించుకొననేల? ఆదరింపనేల?

'ఆత్మవత్సర్వభూతాని'—అని గదా మన భావన.
పరులకొరకు మనము త్యాగము చేయనేల?

'పరోపకారాయ సతాం హి సంపదః'—అని కదా మన నిర్ణయము. శరీరమనఃప్రాణముల కంటెను అతీతమైనదియు, నీ మూడింటిని ప్రకాశింపజేయునదియు కలదని యజ్ఞాతముగ గ్రహించుటయే ప్రేమత్యాగముల యాంతర్యము.

సృష్టికి మూలాధారమైన భగవచ్ఛక్తిని దూరమొనర్చి నచో మన యాలోచనలు పరస్పర విరుద్ధములుగ నుండును. మన భావములు అసందర్భములుగ నుండును. మన మాటలు అర్థరహితములుగనుండును. మన చేష్టలు అసంగతములుగ నుండును. మన చర్మ చక్షువులతో నవలోకించు ప్రతివస్తువును పరిమితమైనదే. ఈ స్థూల చక్షువుతో అనంత తేజోరూపము

నెవ్వరును జూడలేదు. చూడలేరు. అది భగవ్దత్త చక్షువునకు మాత్రమే సాధ్యము. ఆ దివ్యశక్తియే భగవంతుడు. కోటి సూర్యప్రభా సమానమైన పరంజ్యోతినిగూర్చి అపౌరుషేయము లైన వేదములే బాహ్యప్రకటన మొనర్చనోల్లవనునపుడు మన నిర్వచనము నిలువగలదా!

"అణోరణీయాన్ మహతో మహీయాన్" ప్రాకృతిక దృశ్యపరంపరను మాత్రమే జూడనేర్చిన పరిమిత ప్రమాణ ప్రభావములుగల చర్మచక్షువులతో అప్రాకృత దివ్యలావణ్యా ఖండమునెట్లు దర్శింపగలము? అందుకనువైన అంతస్థును ముందుగ మనడెందమున పొందుపఱచుకొనవలెగదా!

భౌతికశాస్త్రము బాహ్యప్రపంచ రహస్యములను బహిర్గత మొనర్చజాలును. ఇది భౌతిక వస్తువులను విరివిగ నుత్పత్తి గావించుటకు వలయు జ్ఞానమును, సాధనములను సమకూర్చును. అంతియే.

భౌతికశాస్త్ర జన్యజ్ఞానము స్థూలము. జడము. కావున జీవితమునకు పరమలక్ష్యము గాజాలదు. దీనికంటెను ఉన్నత స్థాయిలో విలసిల్లెడి ఆంతరంగిక విజ్ఞానము మరియొకటిగలదు. ఇది యంతఃకరణమునకు చెందినది. ప్రకృతిలోగల సూక్ష్మ రహస్యములనిది ప్రకటింపజాలును. ఇదియును జీవిత పరమ లక్ష్యముగాదు. ఈస్థూల, సూక్ష్మప్రకృతులకు సంబంధించిన జ్ఞానమును స్పష్టపరచి సమీకరించి వీనికి మిన్నగ వెలుగొందెడి

ఆత్మతత్త్వమును దెలుపు ప్రజ్ఞానము వేరొకటి కలదు. ఇదియే ఆత్మానుభూతి. ఆనందాస్వాదనము. అమరత్వప్రాప్తి. ఇది దివ్యము. అనుష్ఠాన యోగ్యము. 'జీవితమునకు పరమార్థమైన అనంతబ్రహ్మమును పొందింపజేయునది పరవిద్య. తదితరమగు విజ్ఞానమంతయు అపరవిద్య' అని మన మహర్షులు ఎలుగెత్తి చాటిరి.

"శోధింపంబడె సర్వశాస్త్రములు రక్షోనాథ! వేయేటికిన్
గాధల్? మానవశేముషీతరణి సాంగత్యంబునం గాక దు
ర్మేధ న్దాటగవచ్చునే? సుతవధూమనోగ్రవాంఛామద
క్రోధోల్లోల విశాలసంస్మృతి మహాఘోరామితాంభోనిధిన్.

"(భాగవతము)"

"భౌతికశాస్త్ర పరిశోధనములు వెనువెంటనే ఫలితములు నొసంగజాలక పోవచ్చును. అవియే మనదేశాభివృద్ధికి పునాదులుగ నుండనగును."

—పండిత జవహర్‌లాల్ నెహ్రూ.

నెహ్రూపండితులు మనదేశమునకు ప్రధానామాత్యులు. ప్రముఖనాయకులు. కోట్లాది దేశ, విదేశ ప్రజల పరిపూర్ణాభిమానమును జూఱగొన్న నేతలు. జడప్రకృతికి సంబంధించిన భౌతికశాస్త్రము ప్రాణశక్తితో తొణికిసలాడెడి మానవజీవిత వికాసమునకు పునాది యెప్పటికిని కాజాలదుగదా! దారిద్ర్యమును నిర్మూలించి నిరుపేదల నుద్ధరించుటకు హృదయావేదనతో వారు పలికిన యీ పలుకులు సఫలత చెందవలెనన్నను భౌతిక శాస్త్రపు పునాదులు అట్టి సఫలతను సాధింపజాలవు.

భౌతికశాస్త్రము మనకు అన్నవస్త్రములను జేకూర్ప వచ్చును. ఈ యంశమును కాదనుటలేదు. 'కడుపు మండువాని కడతత్త్వబోధలా?', అనెడి సూక్తి యీ సందర్భమున మా దృక్పథమునుండి జారిపోలేదు. ఆర్థిక రంగముయొక్క మహోన్నతస్థాయి. సామాజికధోరణులపై జలికించెడి చైతన్యప్రభావ మెట్టిదో మేము విస్మరించినవారముకాము.

ఆర్థికరంగము, దాని వెనువెంట భౌతికశాస్త్రరంగము క్రమవికాసము నందుకొనవలసినదే. తత్ఫలితములు జాతీయ జీవితరంగమున ముత్యాలముగ్గులు పెట్టవలసినదే. ఈ విషయమున రెండు అభిప్రాయములనునవి మాకులేవు. కాని, యీ చద్విలాసములు మాత్రమే మన జీవిత విధానములుగావే! కడుపునింపుటొక్కటే మన గరిష్ఠ లక్ష్యముగాదే! నశ్వరసుఖ భోగానుభూతులకు అఱ్ఱులు చాచుకొని, నడక సాగించుటే ధ్యేయముగా మనము భావింపమే!

భారత జాతీయతత్త్వపరమచింతనకు గల అంతరార్థమే అనన్యమైనట్టిది గదా! అది అనశ్వరమైన పవిత్రరుచిర సుఖపరంపరనే లోకమునకు ప్రసాదించును. మహిమాన్వితమగు మానవతనే పెంచును. దివ్యత్వ సంసిద్ధి కభిముఖముగనే జగతినినడిపించును. అయినప్పుడు—నరుని సర్వతోముఖాభివృద్ధికి రాచబాటల జూపెడి ఆధ్యాత్మికరంగమున కన్న—ఏకదేశాభివృద్ధికిమాత్రమే సంతృప్తపడుపబడిన భౌతికశాస్త్రరంగము ఎట్లు

మిన్నయగునో ఊహ కందుటలేదు. ఇది సత్యసంబద్ధముగాని నిర్వచనము. ఇది ప్రజలను పెడదారులను బట్టింప తోడ్పడ వచ్చునేమో!

"అనుభూతికి దెచ్చుకొన్న సత్యము మూల్యమును, వైశిష్ట్యమును గల ఉద్దీపనము నందించును. అందు ప్రేమము, సౌందర్యము తొణికిసలాడుచు భగవద్దర్శన చిహ్నములుగ తేజరిల్లును. ఇట్టి ప్రజ్ఞానసాధనములు భౌతికశాస్త్రమునకు లేవు. కాబట్టియే ఇది, వానిని నిరాకరించి, గణితము, అంకగణితము, లాది గుణాకారములను గావింప దొడంగును."

Aldus Huxley—' Ends & means
**ఆల్డస్ హక్జలే—సాధన, సాధనము.**

భౌతికశాస్త్రము పరులపై నధికారమును బడయుశక్తి నొసంగవచ్చును; ఇంద్రియభోగముల నందింపవచ్చును. అంతియే గాని, అది అంతశ్శుద్ధి నొసంగజాలదు. పరమార్థము నందింప జాలదు. నీతి శీలములను చేకూర్పజాలదు. భగవంతుని నిజ తత్త్వమును నెఱిగింపజాలదు. భౌతికశాస్త్రాధారమున లభించు నభివృద్ధి బాహ్యాభివృద్ధిమాత్రమేయగును. 'అదియే సర్వస్వము' అను భావము సంకుచితము. ఇట్టి భావములు భౌతిక నాగరికతను వెర్రితలలు వేయించి, ప్రపంచమును కలవఱపఱచు చున్నవి. ఘోరవిపత్తులకు గుఱిజేయుచున్నవి. అసంతృప్తికిని, అశాంతికిని మార్గములను నిర్మించుచున్నవి. మన దేశమునగల భౌతికశాస్త్ర కోవిదులు కొందఱు భౌతికశాస్త్రములే

జీవితమునకు ప్రధానములను భావములను ప్రకటింపవచ్చును. కాని, అవియే వాంఛనీయములని భావించుట ప్రమాదకరము. భౌతికశాస్త్ర విజ్ఞానమునం దాఱితేఱిన పాశ్చాత్య పండితులలో కొందఱియందు భావపరివర్తన మున్నతదశకు పెరుగులిడుచున్నది. తమ స్థూలదృక్పథములను నిరాకరించి, ఉన్నతికి గొంపోవు సూక్ష్మదృష్టులను ప్రకటించుచున్నారు. పరతత్త్వమువంకకు పయనింప నువ్విళ్ళూరుచున్నారు. నిజతత్త్వమును గుర్తించిన పిదప, భౌతికశాస్త్రసుమముల పరిమళములపై వెగటు గలిగిన పాశ్చాత్య తాత్త్వికుల పలుకులలో భౌతికశాస్త్రమునకు గల వెల ఎంతయో చూడుడు!

"భౌతికశాస్త్ర మాకళించుకొని కాంచు విశ్వము వాస్తవిక విశ్వము మాత్రము గాదు."

— Joseph Needham.

"ప్రతి సమీకరణమును ఉన్నతానుభవమునకు కవాటములను దెరచును. ఆ యనుభవము మరల యున్నత సమీకరణముల నందించును. భౌతికాధారమునగాని, యంత్రాధారమునగాని యెఱుంగుదానికి నుత్తేజము నొసంగునది 'ఏదో యొకటి' కలదు. దానిని లక్ష్యమునందుంచుటయే తడవుగ 'ఈ ఏదో యొకటి' యను దానిలోనే చైతన్యమును, ఆధ్యాత్మిక భావమును, దివ్యత్వమును గాంచగలము. మనమేకార్యమొనర్చినను యీ నూతనసమీకరణమునకు హృదయముగ వెలుగొందెడి సృష్టి కార్యము యీ దివ్యత్వమునే ప్రసాదించును."

—Jerome Roth Stein.

భౌతికదృష్టితో మనము గాంచు వస్తువులు భౌతికములుగ, అనాత్మకములుగనే యుండుననుట వాస్తవము గాదు. అట్టి వాదము నీనుడలు సమూలముగ ఖండించుచున్నవి. సత్తు – నిత్యము, అఖండము అని వేదములు ప్రబోధించుచున్న ఆధ్యాత్మిక సత్యమును భౌతికశాస్త్రజ్ఞులు కొందరైనను గ్రహించి ఆమోదించుట ముదావహము.

"విశ్వమొక యంత్రముగ గాక మహాభావముగనే నేడు స్ఫురించుచున్నది."

— Sir James Jeans.

"విశ్వము కేవలము భౌతిక పదార్థముగాదు. అది చేతనామయము." అను మహర్షులస్థిర నిర్ణయమును నేటి భౌతిక శాస్త్రజ్ఞులలో కొందరైన ఆమోదించి ప్రకటించు శక్తిసామర్థ్యములను, ధైర్యసాహసములను గలిగియుండుట ముదావహము. భావిభాగ్యోదయ సూచకము. విశాలోన్నత బలిష్ఠపీఠమును సుస్థిరముగ నధిష్ఠించిన నిత్యసత్యము నెఱింగి ఆ యనుభూతి నందుకొనుటయందే మానవుని పరిపూర్ణ వికాసము గలదు. అప్పుడది తన శీతలకాంతుల దశదిశల బ్రసరింపజేసి కేవలము మానవులకేగాక సర్వజీవులకును శాంతిభద్రతలను బ్రసాదించును. వంశపరంపరానుగతములైన శిష్టాచారములను, అనుభవములను వర్తమానకాలమున బీజములుగ నాటి వాని నుండి శాంతి సత్యశాఖా విలసితమై, సుందర సుగంధ భావపుష్పపూర్ణమై రుచ్య సత్య ఫల సంభరితమై భావికాలమున నేర్పడు ధార్మిక మహా

వృక్షము.ను సంరక్షించుటయందే మానవుని విశిష్టత గలదు నాడే మనము,ను, మన సంతతియు దాని శీతల ఛాయల నిర్విచార ముగ విశ్రమింప గలుగుదుము. నిర్మల వాయువుల నాఘ్రా ణించుచు, మధుర మధుర ఫలతతుల నారగించుచు, పావన జీవన మకరంధమును గ్రోలుచు, ప్రశాంత ప్రసన్న జీవితమును గడుప గలుగుదుము. ఇదియే మనకభిలషణీయము.

భౌతికశాస్త్రములే శాస్త్రములు కావు. రసాయనికపదార్థ విజ్ఞానశాస్త్రములు, రసాయనిక పరివర్తనములు, యాంత్రికశక్తి, విద్యుచ్ఛక్తి మున్నగునవి భౌతికములు. సాంఖ్య, యోగ, వేదాంత, తత్త్వశాస్త్రములు ఆధ్యాత్మికములు. భౌతికవాదు లలో – నాస్తికులలో గల వికార భావములే ప్రపంచమును సంక్షోభపరచుచున్నవి. వారి క్రూరచర్యలును, వినాశకరములుగ నున్నవి. వారి విధ్వంసక విధానములను, హింసాకృత్యములను నిర్మూలించు దివ్యసాధనము ఆధ్యాత్మిక విజ్ఞానమే! బ్రహ్మాను భూతియే!

ఎవ్వరేమి వాకొన్నను కల్లోల ప్రపూర్ణమై కలుషీభూత మైయున్న జనజీవన గంగపునః ప్రవిమలతరంగయై వర్ధిల్లుట కింతకన్న మార్గాంతరము, 'న భూతో న భవిష్యతి' ఈ నిత్య సత్యమును గుర్తింపకుండుట కనులుండియు గనుట కంగీకరింపని మందభాగ్యుని చందమే యగును.

'భౌతికశాస్త్రమే సర్వస్వముకాదు. అది మానవ కళ్యాణమునకు మూలమునుగాదు. అందులీనమై తదతీతముగ తన దివ్యదీపికల నుద్దీపింపజేయు ప్రజ్ఞానమును గలదు' అని భౌతిక శాస్త్రము నందనుభవమును గడించి ప్రఖ్యాతినిగాంచిన పాశ్చాత్యపండితులు పెక్కుఱు ఎలుగెత్తి చాటుచున్న యీ తరుణమున, సాటిదేశములన్నియు కన్నులు తెరువని శైశవావస్థ యందుండగనే ఆధ్యాత్మికానుభూతులకు జన్మస్థానముగ నిలిచి మానవకళ్యాణమును, విశ్వశాంతిని ప్రసాదించు విజ్ఞాన భితునిడి యుగయుగములుగ దేదీప్యమానముగ వెలుగొందుచు దివ్యతత్త్వమును కన్నులపండువుగ జూపెట్టుచున్న భారతదేశమునకు 'భౌతికశాస్త్రమే మన జీవితములకు పునాదిగ నుండవలెను' అని మనదేశౌన్నత్యము నాకాంక్షించు పెద్దలు కొందఱు పలుకుట మన దురదృష్టము.

కాలప్రవాహవేగోద్ధతికి కగ్గక, కాంతి తగ్గక నిగ్గులీనెడి మన సాంప్రదాయ సరణికి విరుద్ధముగ వెలువడెడి యిట్టి పలుకులు భ్రమప్రమాదజనితములు. వానికి భిన్నములుగ పాశ్చాత్యులు చెప్పు పలుకుల నిట వినుడు:

"పాశ్చాత్యనాగరికతను, భౌతికశాస్త్ర ప్రభావమును ఉత్సాహావేశములతో నామోదించువారు గూడ వాని శక్తి పాటవములు క్రమముగ క్షీణించుటను బరిశీలించి, భౌతికశక్తి ఆధ్యాత్మికశక్తితో చేతులు గలిపి పయనింపజాలకుండుటను గాంచి, నేడు కొంత నిరుత్సాహమును జెందకతప్పదు. భారత

దేశము సర్వదా సాధుత్వము నొదల వహించుచున్నది. నిత్య సత్యములు, ఆధ్యాత్మికములునగు ఉత్తమాదర్శముల నసుష్ఠించు చున్నది, పాశ్చాత్యదేశముల యందలి పండితులలో కొందఱు ప్రముఖు లీ సత్యమును నేడు గ్రహించి యామోదించు చున్నారు."

— Lord Linlithgow.

"అతి పురాతనములు, బూజు పట్టినవి అని భావింపబడు చున్న గ్రంథములే నేడు మనకు జ్ఞాననిధులు. నేటి ప్రపంచము భారతదేశపు తోడ్పాటు నెంతయు గలిగి యుండవలెను. పరస్పర వైరుధ్యములను విశదీకరించి వానికతీతముగ వెలుగొందు దివ్యసత్యము వంకకు రాచబాటలను నిర్మించి అందు పయనించిన భారతదేశ ఋషిపుంగవులు భగవంతుని ప్రత్యక్షముగ గాంచిరి. భారతదేశము తన ఆధ్యాత్మికజ్యోతితో యూరపునకు మార్గమును జూపుగాక"

— Professor J. H. Feleure, B.SC., F.R.S.

"భగవంతుని ప్రత్యక్షముగ గాంచినది ఒక్క భారత దేశము మాత్రమే. భగవంతుని గాంచు ఆతురత గల వ్యక్తి భారతదేశము నెఱుంగవలెను."

— Vicente Auelino.

"పవిత్రాధ్యాత్మిక సంప్రదాయములకు పుట్టినిల్లుగ ప్రదీపించు అదృష్టవంతమగు దేశము భారత దేశమే. ఇట్టి పవిత్రాధ్యాత్మిక తేజస్సుతో సజీవముగ, చైతన్యవంతముగ - యుగ

యుగములుగ నుద్దీపించుచున్న దేశ మొక్క భారతదేశమే. ఇట్టి సత్సంప్రదాయముల సుశిక్షణము నందించు ఏకైక పవిత్ర సాధనము సంస్కృత భాషయే".

— Renoe — రీనో.

'భారతదేశము యూరపునకు మార్గమును జూపును గాక' అని పాశ్చాత్యులే పలుకుచుండ - బూజుపట్టినవని భావింప బడిన పురాతన గ్రంథములే నేటి మన సంపదలు' అని వారు కీర్తించుచుండ—తాను భగవంతుని ప్రత్యక్షముగ గాంచి పరులకు జూపెట్టుచున్న దొక్క భారతదేశమేయని పాశ్చాత్యపండితులు. పెద్దలు ఎలుగెత్తి చాటుచుండ—

దివ్యసత్యము వంకకు భారత సనాతనయోగిపుంగవులు మాత్రమే బంగారు బాటలు దిద్దగలిగిరని వారు నిస్సంకోచముగ విశ్వసించుచుండ—

భారత ఆధ్యాత్మిక జ్యోతియే మమ్మంధకారము నుండి వెలుగునకు నడిపింప శరణ్యమగు గాక యని పాశ్చాత్యులే ప్రార్థనలు సలుపుచుండ—

జీవితములోని యున్నత సమస్యలను తమ నాగరికత పరిష్కరింపజాలదనియు, పుట్టినదాది గిట్టు వఱకు పుష్టిని, తుష్టిని, శాంతిని, కాంతిని: సుఖమును, విభవమును అందింపజాలకుండె ననియు పాశ్చాత్యులు పశ్చాత్తాపమును బొందుచుండ—

మన మతగ్రంథములు పురాతనములు, పనికిమాలినవి అను దుర్భావమును నిర్మూలించుకొని అవి ప్రబోధించు దివ్య సందేశమును ఉద్దీపింపజేయుట మాతృ దేశమును ప్రేమించు ప్రతి భారతీయునికిని పరమధర్మము.

భారతదేశము పల్లెలకు నిలయము. పల్లెలునిజముగ దేశ మాత వేణిపై వెలుగుల వెదజల్లెడి మల్లెలు, పల్లెల ప్రజలును, పట్టణములందలి సామాన్య ప్రజలును సరల స్వభావులు. సాధు వులు. పవిత్రమైన అంతఃకరణము, తృప్తి, వీరి జీవితములందు సర్వథా భాసించుచుండును. సత్సంప్రదాయములు, శిష్టాచార ములు, శీల శౌచములు, జానపద గానములు వీరి సొత్తులు. పల్లెలు కుటీరపరిశ్రమములకు, కళలకు నిలయములు. ఇందలి జనములకు దాన ధర్మములు. దయా దాక్షిణ్యములు నిత్య నియమ పాలనములు. ఇవి ప్రజలనెంతయు నాకర్షించుచుండును. వీరియందవి యుత్సాహావేశముల నుప్పొంగ జేయుచుండును. భక్తిశ్రద్ధలను వర్ధిల్ల జేయుచుండును. ఉత్సాహావేశములు, భక్తి శ్రద్ధలు ప్రబలుటయే తడవుగ అభివృద్ధి వికాసములు వైశాల్య మును, లోతును, సాంద్రతను బడసి విశ్వవ్యాప్తములగును. ఇట్టి సహజ, సరల జీవితము తృప్తికి బీజము. శాంతికి మూలము. కళ్యాణమునకు కారణము. నిత్యానందదాయి యగు ముక్తి ఫలము.

"నూతన జీవితాచారములు, పోకడలు ఒక ప్రధాన లోపమును గప్పిపుచ్చుచున్నవి. సాంకేతిక భౌతికశాస్త్ర విజ్ఞాన ములు వెలువరించిన వాతావరణమున మనవిధ్యుక్త ధర్మములు

అసంపూర్ణముగనే పరిణతి నొందుచున్నవి. భౌతికశాస్త్రములును, భౌతికనాగరికతయును ఆశ్చర్యకరములు. కాని యివి మానవుని మూర్తిత్వమును, ప్రతిభను విచ్ఛిన్న మొనర్చుచున్నవి. లాలసతను బెంచి, లక్ష్యమును భంగించుచున్నవి. సాంఘిక, నైతిక, వైజ్ఞానిక పతనములను ప్రత్యక్షముగనే గాంచుచున్నాము.

"హ్రస్వదృష్టిగల అల్పజ్ఞులవలన ప్రజాతంత్రములు చైతన్యవంతములగునను భ్రమప్రమాదములకులోనై జీవించుచున్నాము. భౌతికవాదులపై నిలుపబడిన హద్దులుమీరిన ఆశలు క్రమముగ వినాశనమును చేకూర్చుచున్నవని గుర్తించుచున్నాము. పెద్ద పెద్దజాతుల భవిష్యత్తును నిర్మించు సమస్యలు యిప్పటికిని అపరిష్కృతములుగనే మిగిలియున్నవి. కాగా! యువకులింకొకవిధమగు నాదర్శమునను నిర్ణయించుకొనుట నేడత్యావసరము. తమ జీవితములతో నానాదేశ ప్రభుత్వములు అనంతకాలమును తులదూచుచుండుటవలన మనము భ్రమ ప్రమాదములకు లోనగుచుంటిమి. సంకుచితమగు మన భౌతిక దృష్టిని దివ్యత్వము దెసకు మరల్చవలెను. మన ప్రమాదములకు, దోషములకు మనమే కర్తలము. ధర్మమునుండి యధర్మమును, న్యాయమునుండి యన్యాయమును వేఱుచేయుట కసమర్థులముగనే యున్నాము. మానవసమాజ ధర్మనియమముల నతిక్రమించితిమి. ఇట్లు మనలను దుఃఖములపాలు జేయు పాపములను మనమే యార్జించుకొనుచున్నాము.

"ఇంతకుమున్ను మనము గడించిన దుష్టత్వమును వీడి శిష్టత్వమును సంఘటించుకొనుశక్తి మనకుగలదు. విపరీత విపత్కర పరిస్థితుల కాకరమై మన భవ్యజీవిత వ్యవస్థయొక్క పునాదులను గదలించుచున్న యీ నవీన నాగరికత భ్రష్టమగుచో వేఱొండు విశిష్టనూత్న నాగరికతను మనము సృజించుకోన గలము. శాంతిని బడయుటకు అజ్ఞాన జన్యములగు బాధల ననుభవింపవలసియుండునా? చిక్కులను దొలగించి యభివృద్ధిని సాధించు యుద్దీపనమును తిరిగి పొందజాలమా? మానవుని గుఱించిన నేటి మన విజ్ఞాన మత్యల్పమను విషయమును విస్మరింపకుందుముగాక!

"ఈగ్రంధారంభమున జూపెట్టిన మహాసమస్యలు యింకను అపరిష్కృతములేయను విషయమును విస్మరింపకుందుము గాక! అచేతనములకు సంబంధించిన భౌతికశాస్త్ర విజ్ఞానము మనలను పెడదారులబట్టించుచున్నది. భౌతికశాస్త్ర నిర్ణయము లన్నింటిని అంధులమై ఆమోదించితిమి. ఏకాకిగ, సంకుచితుడుగ, అజ్ఞానిగ, అవినీతి పరుడుగనున్న మానవుడు ఆధ్యాత్మిక బలప్రపూర్ణమైన ఆత్మశక్తి కొరవడుటచే తనను తన సంస్థలను సక్రమముగ నిర్వహింప సమర్థుడు కాజాలకపోయెను. చైతన్యవంతములగు నంతఃకరణశాస్త్రములు అమూల్యములగు రహస్యముల నావిష్కరించుచున్నవి. ఇవి యందించు విజ్ఞానమే మానవ పునర్నిర్మాణమునకు సముచిత సాధనముల సమకూర్చును."

— Dr. Alexis Carrel Nobel Prize Winner

భౌతికశాస్త్ర విజ్ఞానము నామూలాగ్రముగ పరిశీలించి చక్కగా జీర్ణించుకొన్న విశాలభావ సంపన్నుడగు నీ వైద్యుని వాక్యములు ఆధునిక నాగరికతా విజ్ఞానములు రెండును విఫలములై నవని విశ్రాంతి నెఱుంగని యాంత్రిక జీవిత పరులగు నవీనులకు విస్పష్టపరచుచున్నవి. "విషయములను పరస్పర సంబంధము గలవిగ నియమబద్ధ మొనర్చునదే భౌతిక శాస్త్ర విజ్ఞానము. ఇట్టి దృక్పథముతో మానవుడు సముపార్జించుకొనగల ఉన్నత విజ్ఞానమును కించపరచు చుంటినని నన్ను సంశయింపకుడు. 'ఉన్న దేమి'? అనుజ్ఞానము 'ఏమియుండవలెను' అనువిజ్ఞానమునకు సాక్షాత్తుగ కవాటమునను దెఱువజాలదు. 'ఉన్న దేమి' అను విషయమున విపుల విజ్ఞానమును విస్పష్టముగ నార్జించిన వారును, ఆ విజ్ఞాన సాధనముచే మానవాకాంక్షయగు, 'మానవ గమ్యస్థాన మెద్ది?' అను విషయమును గ్రహింపజాలక పోవచ్చును. కొన్ని విషయములను సాధించుటకు భౌతికశాస్త్ర విజ్ఞానము ప్రబల సాధనముల నొసంగుట వాస్తవమే! కాని మానవ జీవిత గమ్యస్థానము తత్సాధనసంపత్తియు మరియొక (ఆధ్యాత్మిక) విధానమున మాత్రమే లభించును. ఇట్టి లక్ష్యమును గలిగి యున్నపుడే మన యునికినయును, కార్యకలాపములును - విలువను అర్థమును గలిగియుండును. సత్తును గూర్చిన విజ్ఞానమాశ్చర్యకరము. మనయునికినిగల హేతుసంబద్ధ భావములు సీమాబద్ధములు"

— Albert Einstein

ఇవి పరస్పరానుకూలమును ప్రకటించు నిర్మాణవంతములగు సహకార, సమీకరణ, సముచిత భావములు. భౌతికశాస్త్ర విజ్ఞాన పారంగతుని భావమధురతా ప్రబోధములు. కావున భౌతికశాస్త్రమే జీవితమునకు పునాదిగ నుండవలెనను భావము సరియైనది కాదనుటలో నిసుమంతయు వేగిరపాటులేదు. ఈ భావము సత్యదూరమని నుడువుటలో ప్రమాదముసయితములేదు.

"ఆధ్యాత్మికములగు పునాదులపై నిర్మింపబడనిచో పాశ్చాత్య నాగరికతయంతయు నేబది వత్సరములలో తుత్తునియలగును. ప్రభుత్వమును పశుబలముతో నడుపు కేంద్రములే దానికి అధోగతిని. వినాశమును చేకూర్చు కేంద్రములుగ మారుటను గాంచెదరు. కాబట్టి పశ్చిమ దేశములను సంరక్షించునది ఉపనిషన్మతమే. వేదాంతము మాత్రమే"

— వివేకానందస్వామి.

ఆ బాల్యసన్యాసియు, ఋషిసత్తముడును, శాశ్వత సత్యవేత్తయు, సనాతన సన్మార్గదర్శియు, సంయమి చంద్రుడునునగు నీ మహాత్ముని పలుకులకు గడచిన రెండు భీకర సంగ్రామములు ప్రత్యక్ష నిదర్శనములు: ప్రబల సామ్యములు పశ్చిమదేశములలో సదా రగుల్కొలుప బడుచున్న కలుషీకృత వాతావరణము, జడలు విఱబోసికొని తాండవించు స్పర్ధ, దారుణవికటాట్టహాసములు సలుపు స్వార్థచింతన మున్నగునవి వివేకానందుని సువర్ణ సూక్తులకు నేటికిని ధ్రువత్వమును గల్పించుచునే యున్నవి. ఆ మహానీయుని ప్రబోధములు నేటికిని ధ్రువతారలై వెలుగొందుచునే యున్నవి.

అహింసా సత్యములను, ఆధ్యాత్మిక సాధన సంపత్తిని ఆధారముగనిడికొని గాంధీమహాత్ముడు సరల మార్గమున సత్యాగ్రహమును సాగించిరి. స్వరాజ్యమును సాధించిరి. ధర్మవిజయమును సుస్థిరముగ స్థాపించిరి. కాని భారతీయులమైన మనము నేడామహాత్ముని సత్య ప్రబోధములను విస్మరించి పెడదారులను బట్టుచుండుట అత్యంతరము విచారకరము. ఇది విషఫలితములనే చేకూర్చును. చేటునే యొడగూర్చును.

"ఆధునిక ప్రపంచము యంత్రమయముగ నొనర్పబడు చున్నది. తత్ఫలితముగా స్పర్థలు, వైషమ్యములు నిత్యము ప్రళయాట్టహాసములను గావించుచున్నవి. వీనిని ప్రతిఘటించు పవిత్రాధ్యాత్మిక జీవితమును స్త్రీపురుషులెల్లరును బాగుగ నిర్వహింపవలెను. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయములు నిర్వహింపదగు ప్రధాన ధర్మమిదియే.

"రోము సామ్రాజ్యమును అనాగరిక జాతులంత మొందించెను. నవీన నాగరికతను ధ్వంసమొనర్పు అనాగరికలు నేడు బాహ్యమునలేరు. పాశ్చాత్యులమగు మనమే అట్టి అనాగరికులుగ జీవించుచున్నాము. మానవునియందు పశుత్వమును దొలగించి, మానవత్వమును నిరూఢమొనరించి, దైవత్వమును ప్రతిష్ఠించెడి ఆధ్యాత్మికాదర్శముల నావిష్కరింపజేసి, ప్రకటింపకున్నచో నిత్యమును, వాస్తవమును-అగు విజయముగాని, సుఖముగాని మనజాలవు. అణువును విభజించు అల్పజ్ఞులనుగాక, ఆ యణుశక్తిని శ్రేయోదాయకముగ వినియోగించు బుద్ధిమంతులుగ మానవులను తీర్చిదిద్దవలెను."

Some Tasks for Education Sir Richard Livingston.

ఇవి సంపూర్ణానుభవఫలముగ హృదయకుహరమునుండి యువ్వెత్తుగ నుజ్జ్వలించిన ప్రజ్ఞాపూరిత ప్రబోధములు.

నవీన ప్రపంచమున సురక్షితముగ, సౌమ్యముగ జీవించుటకును, నిత్యకల్యాణమును, అనంతానందమును, అనుభూతికి దెచ్చుకొనుటకును మానవునియందుగల మహోత్తరమైన దివ్యశక్తి ఉద్దీప్తముగావలెను. భౌతికశాస్త్రములు, సాంకేతిక విజ్ఞానము తమ ప్రజ్ఞాపాటవములకు నిదర్శనములని నేటి మానవులు సగర్వముగ బలుకుచున్నారు. అవి యొసంగుఫలితములకు పువ్వి ళ్ళూరుచున్నారు. కాని, వారిలో మానవత్వము మాతనుడు గంటుచున్నది. ఈ స్థితి కేవలము వినాశకరము. దివ్యత్వమే మానవజీవిత పరమావధి. పశుత్వమును పాఱద్రోలి, దివ్యత్వమును విశ్వవ్యాప్త మొనర్తుముగాక!

మనకు జ్ఞానమున్నది. కాని, ప్రజ్ఞానములేదు. మానవులు దివ్యులై మనవలెనను పవిత్రభావము మనలో లోపించుచున్నది. మాధుర్యమును, కాంతిని వ్యాపింపజేయు వివేకయుక్తమగు ప్రజ్ఞయు, తదనుగుణమగు వాతావరణమును మన పాఠశాలల యందును, కళాశాలలయందును, విశ్వవిద్యాలయముల యందును నామమాత్రములుగనే యున్నవి. ఈ స్థితిగర్హణీయము. పవిత్ర వాతావరణమును, దివ్యత్వమును ఉద్దీపింపజేయు విద్యాలయ ములు నేడు మనకెంతయు నావశ్యకములు. ఉపాధ్యాయుల యందు, బాలబాలికలయందు సరలత, సాధుత్వము, హృదయ

వికాసము, సేవాతత్పరత, సత్ప్రవర్తనము, పవిత్రత ప్రకాశింప వలెను. ఇదియే మానవజీవిత పరమావధి. ఇదియే సుఖాను భవమును గూర్చును. ఆనందామృతాస్వాదన భాగ్యమును ప్రసాదించును.

భౌతిక శాస్త్రజ్ఞతావేశముగాని, ఆర్థికోన్మాదముగాని, అనాత్మవంతమగు దుందుడుకు రాజకీయములుగాని మన ప్రాచీన సత్సంప్రదాయముల నిరాకరించుటగాని, పర దేశములను ద్వేషించుటగాని ఐకమత్యముగాజాలదు. అది నిజమైన దేశ భక్తియునుగాదు. గాంధిమహాత్ముడు ఆధ్యాత్మికమైన చైతన్య మునే జాతికి ఆయువుపట్టుగా అభిప్రయించెను. ఆధ్యాత్మిక తేజస్సువలననే దేశము నుద్దీపింపజేసెను. ప్రజలను త్తేజితుల గావించెను. శీలసంపన్నులుగ నొనర్చెను. కాబట్టి నేటి మన నాయకులు మతద్వేషులుగ — మత రహితులుగ నుండి అభి వృద్ధిని వాంఛించుట దాహపీడితులు ఎండమావులను వెన్నాడు టయే కాగలదు. మనజాతి వికాసమునకు, మానవశ్రేయస్సునకు మతమే మహత్తరమైన సాధనము. ఆలసింపక ఈసత్యమునెంత బాగుగ గ్రహించిననంత విశేషముగా మనకును, సకల ప్రపంచ మునకును శుభము లభించును. సుఖము చేకూరును. ఆధ్యాత్మి కతా విహీనమగు జీవితము శవసదృశము. చైతన్యవంతమగు ప్రాణశక్తిని ప్రసాదించునది మతమే. అట్టిశక్తి, సనాతన ధర్మోజ్జీవనమున మాత్రమే సిద్ధించును.

"ఆధ్యాత్మిక వికాసము నొసంగని విద్య యదార్థమగు విద్య కాజాలదు. అట్టి విద్య యుదరపోషణమునకు తోడ్పడ వచ్చును. అసహజము, అధార్మికమున నేటి మన బిడ్డల నడవడి దోషభూయిష్టమగు విద్యావిధానఫలితమే. ఆధ్యాత్మిక శిక్షణతో గూడిన విద్య నే డెంతయు నావశ్యకము, శైశవము నుండియు మత సత్యములను బోధింపవలెను. ఆధ్యాత్మిక చైతన్యమును కలిగింపవలెను. తద్విరుద్ధమగు మన రాజ్యాంగ నిర్మాణమును గాంచుడు!

I ప్రభుత్వ సంస్థలలో మతమును బోధింపరాదు.

(28-వ ఆర్టికిల్)

II మతసంబంధములగు పన్నులను విధింపరాదు.

(27-వ ఆర్టికిల్)

III బిడ్డల తల్లిదండ్రులయు లేక సంరక్షకులయు ననుమతి లేనిదే, ప్రభుత్వసహాయమును బడయుచున్న సంస్థలు మతశిక్షణము నొసంగజనదు.

(19-వ ఆర్టికిల్)

"ఇట్టి స్థితిలో మనకు మతమును బోధించున దెవరు? ఆధ్యాత్మిక వాతావరణమును విశ్వ విద్యాలయములు, కళా శాలలు, పాఠశాలలు విధిగా నిర్వహింపవలెను, ప్రభుత్వము లాదరింపవలెను. అట్లు గానినాడు ఆధ్యాత్మిక వాతావరణమును సృష్టించి, సంరక్షించుటకు గృహమే శరణ్యమగును.

"సుధీరంజనదాసు" భారత ప్రధాన న్యాయమూర్తి

జీవితవికాసమును, అభ్యున్నతిని, ప్రయోజనములను, విలువలను ప్రసాదించు నదియే నిక్కంపు విద్య. అది యెల్లర కును వాంఛనీయము గదా!

ఈ శక్తి విపుల నైతిక విధానములనుండి మాత్రమే యుద్భవించును. తత్త్వశాస్త్రము (దర్శనము) నైతిక శిక్షణము నిచ్చును. ఆదర్శముల నందించుటకు తత్త్వశాస్త్రము దిక్సూచి. అది లేనిచో చుక్కానిలేని నావ వలె మన మెట కేగుదుమో తెలియదు. తత్త్వశాస్త్రము విద్యకు మూలము. విద్య, జీవితము, తత్త్వశాస్త్రము — ఇవి మూడును పరస్పర సంబద్ధములు, అవిభాజ్యములు. తత్త్వము మననమును, విద్య నడవడిని చూపించెడి ఒకే నాణెమునందలి రెండు వైపులు. ఆత్మగౌరవ మును గాపాడుకొనుచు, నుదరపోషణార్థము ధనము నార్జించు సామర్థ్యము నీయజాలని విద్యావిధానము నిష్ప్రయోజనకరము కేవల ముదరపోషణమును సాధించు విద్యక్షుద్రము. తాను చక్కని పరిశ్రమమును గావించుచు తన జీవిత నిర్వహణమునకే కాక పరులకును దోడ్పడ వీలు గలిగించెడి సుశిక్షితవిద్యయే సద్విద్య. మన జీవితములందెదురొ్కన వలసిన సమస్యలను ధైర్యసాహసములతో, ఉత్సాహముతో వివేకపూరితమగు బుద్ధి కుశలతతో పరిష్కరింపవలెను. కాబట్టి మానవులను యంత్రము లుగ నొనర్చు ఫ్యాక్టరీలుగా నుపకరించెడి నేటి మన విద్యాలయ ములను ఆమూలముగ, వికాసవంతములగు విధానముల జూపెడి పథకములపై చక్కగా సంస్కరించి, సరిదిద్దవలెను. మానవుని

యంతఃకరణమును పరిశుద్ధముగ నొనర్చి వికసింపజేసెడి యాదర్శమే శ్రేయోదాయకము. దీనిని సఫల మొనర్చునది పవిత్ర మత ధర్మ నిర్వహణమే.

నవీనమానవ సమాజము కుతర్కముల మూసలో భౌతిక వాదవహ్నికి సలసల క్రాగిక అగుచున్నది. ధనతృష్ణ మితిమీఱుచున్నది. ఆ తృష్ణదీరకుండుటచే నీతికి స్థానము లభించుటలేదు. ధనికవాదము, భౌతికవాదము, విప్లవవాదము మున్నగు భిన్నభిన్న సిద్ధాంత రాద్ధాంతములను ప్రబలించు వితండవాదములను వ్యాప్త మొనర్చెడి చార్వాకులు నేడు గజ్జగట్టి విచ్చలవిడిగా రచ్చకెక్కి రభస జేయుచున్నారు. ఇట్టి తరుణమున మన భౌతిక చక్షువులకు గన్పింపని, మనము స్పృశింపజాలని యొకానొక అతీత శక్తి మనలను నడుపుచున్నదను సత్యమును — దైవీశక్తిని మనము మఱువకుందుముగాక! సత్యము, ప్రేమము అను సాధనములతో నీ శక్తిని గాంధీమహాత్ముడు ప్రకటన జేసిరి. ధర్మము హృదయమునుండి వికసింపగనే శీలసంపత్తి వ్యాప్తమై వెలుగొందును. కుటుంబముననూ, సమాజముననూ, నానా దేశములందునను సౌందర్యముద్దీపించి, సమీకరణమును సమత్వమును స్థాపించును. ఇది శాశ్వతమైనయునికిని బడయగనే సహనసఖ్యములు భక్తివిశ్వాసములు తేజరిల్లును. సుశిక్షణము, అనుభవము సుస్థిరముగ పాదుకొనును. శాంతిసుఖములు స్థాపితములై జీవితమునకు స్థాయిని, హాయిని, చేకూర్చును. మధురఫలముల నాస్వాదింపజేయును. భిన్ననామములతో భిన్నరూపములతో నారాధింపబడు దైవములకు బ్రహ్మపదార్థమే మూలమని విదితమగును.

ఏకమేవాద్వితీయం బ్రహ్మ ఆకాశాత్పతితం తోయం యథాగచ్ఛతి సాగరమ్ సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అనిగదా! మన మహర్షుల నిర్వచనము.

మానవులు తృష్ణకు వశ్యులై, యంత్రములపగిది కీలు బొమ్మలవలె సంచరింపజనదు. రాజకీయములు, సామాజిక సమస్యలు, సాహిత్యము, శాస్త్రములు, కళలు మున్నగునవి మానవుని భోగములను, కామతృష్ణనుదీర్పు సాధనములుగ నుండరాదు. ఇవి భగవంతునకు సమర్పింపబడెడి సుందర, సుగంధ బంధురసుకోమల సుమంజల సుమములుగ నుండవలెను. వేదము లీసత్యమునే గానమొనర్చుచున్నవి. యథార్థమగు సంస్కృతీ నాగరికతల సారమునిదియే. ఇందే మానవుని సంపూర్ణవికాస మంతర్గర్భితమైయున్నది.

భగవత్సేవకర్పింపబడని లలితకళలు, ఉన్నత సత్యశిఖర ములకు గొంపోవజాలని సాహిత్యము, శీలము నొసంగని విద్య, నైతికంపు పునాదులులేని రాజకీయములు, ఆధ్యాత్మికశక్తుల నావిష్కరించి దివ్యత్వమునుద్దీపింప జేయజాలని సమాజజీవితము, ధర్మము ననుష్ఠింపజాలని ప్రభుత్వములు సమాజమునందు సంక్షోభ మును, స్పర్థలను, అశాంతిని ప్రకోపింపజేయుచుండును.

నేడు పాశ్చాత్యదేశములకు బట్టిన దుఃస్థితియిదే. నయ శీలసంపన్నులకు నిలయముగ, దివ్యావతారమూర్తులకాలవాల ముగ, ఆధ్యాత్మికసంపదల కాలయముగ, పవిత్ర ప్రశస్త భావ

బీజములకు నిధిగ, ప్రాక్తన భవ్యసంస్కృతీ వైభవాభివృద్ధికి మూలకందముగ, వికృతిలేని సుకృతుల సత్కృతులకు కార్య రంగముగ, ఉదారుల ముదావహసదాశయములకు సార్వకాలి కోదాహరణముగ, పరంజ్యోతి తత్త్వచింతనాపరుల విజయము నకు పతాకగవెలుగొందు భారతము పాశ్చాత్యుల తుణికంపు మెఱుపులకు మురిసి గ్రుడ్డిగ వారినను కరించుచు తనకు చేటును, ప్రపంచమునకు ప్రళయమును జేకూర్పకుండునుగాక. భారతము సర్వమానవులకును తన దివ్య తత్త్వప్రసాదమును విరివిగ — ఉచితముగ - పంచిపెట్టి విశ్వశాంతిని మానవ కళ్యాణమును అనుగ్రహించుగాక ! సర్వమును మంగళప్రద మొనర్చునుగాక !

"విశ్వమును సంరక్షించి సుస్థిరమగు శాంతిని స్థాపింప గల శక్తి ఆధ్యాత్మిక తేజస్సునకు మాత్రమేగలదని మాపరి పూర్ణ విశ్వాసము. ఇది మానవులను సంకుచిత జాతీయతకు, తృష్ణావేశములకు, అతీతులను గావింపగల అమృత భాండము. పరస్పర సహానమును, న్యాయమును ధర్మమును, నెలకొల్పి శాంతికి చైతన్యముగ వెలుగొందుశక్తి ఆధ్యాత్మిక తేజస్సే. ఇది భగవత్సామ్రాజ్యమును భక్తితో నారాధింప జేయును."

— Archbishop of Canterbury Headwar–P. 211

ఇంద్రియముల వలనను, హేతువుల వలనను సిద్ధించు జ్ఞానమే సర్వస్వముగాదు. అంతకంటెను ముఖ్యమైన ఆత్మాను భూతి యొకటికలదు. ఆధ్యాత్మిక తత్త్వమును సిద్ధాంతము జేయుటకు బ్రహ్మము నావిష్కరించుటకు తర్కము, హేతు వాదము మనస్సు, బుద్ధి యివి యెవ్వియును జాలవు.

నాయమాత్మాప్రవచనేనలభ్యో.
నమేధయా, నబహునా శ్రుతేన ।
యమేవైషవృణుతే, తేనలభ్య స్తస్యైష
ఆత్మావివృణుతేతనుంస్వామ్ ॥

కఠము—౨౩ శ్లోకము.

ఇది కొంతవరకు తోడ్పడవచ్చును. ఆధ్యాత్మికానుభూతి మాత్రమే అమరత్వమును నిత్యానందమును గలిగించును. -

'హేతువు మనలను ఉన్నతస్థితికి గొంపోవజాలని విషయములుగలవు. విశ్వాసముతో వానినంగీకరింప వలసినదే. అయినను విశ్వాసము హేతువును నిరాకరింపదు దాని కతీతముగ నుండును. హేతువునకు అందని అతీతములుగనున్న విషయములను గూర్చి విశ్వాసము ఆరవ యింద్రియముగా పనిచేయును.'

—మహాత్మా గాంధీ.

బాహ్యప్రకృతి విజేతయై భౌతికశాస్త్రవిజ్ఞాన పూర్ణ బుద్ధిబలముచే మానవుడు విరివిగ వస్తూత్పాదనము గావించుచున్నాడు. భౌతికసామ్రాజ్యసింహా పీఠినధిష్ఠించినాడు. కాని తద్వస్తు వినియోగమున లభ్యమయ్యెడి ఆనందమునను భవింపగల హృదయమణచబడి యుండుటచే సర్వ భౌతిక సంపదయు నతని హృదయమునకు భారమైపోయినది. నేడు మానవుని ఉన్మత్తుని గావించుచున్నది ఆ భౌతిక సంపదయే! బుద్ధి శుష్కజ్ఞానమును వ్యాప్తమొనర్చును. ఆనందరసానుభూతి కావాసము హృదయం. కాబట్టి హృదయార్ద్రితలేని జ్ఞానము సాటిమానవుని గట్టిగ

నణచుటకే తోడ్పడును. భౌతికశాస్త్రజ్ఞుల పరిశోధనా పరిశీలన ముల ఫలమగు జ్ఞానము వస్తువులను విరివిగ నుత్పత్తిగావించుటకే వినియోగపడుచున్నది. కాని భౌతికశాస్త్ర పాండిత్యము వానిని క్రమపద్ధతితో నెల్లరకు సముచితముగ పంచిపెట్టి సద్వినియోగ మొనర్చెడి యానందము ననుభవింపగల హృదయమును తన భారముచే మొరటుగ నణచుచు వికారమును, విషవాయువులను వెలికి గ్రక్కుచున్నది.

'భౌతికశాస్త్ర జ్ఞానము మనోబద్ధము, హృదయము ప్రజ్ఞానమునకు జన్మస్థానము. సర్వవిజ్ఞానము హృదయము నుండియే జన్మించి మానసిక క్షేత్రముద్వారా బాహ్యమునకు ప్రకటితమగును' అని మన మహర్షులు స్థిరముగ నిర్ణయించిరి. బాహ్య ప్రకృతి విజయము నాగరికతా ఫలితము. భౌతిక శాస్త్రమువలన నాగరికత వర్ధిల్లును. అంతఃకరణ ప్రకృతి విజయము సంస్కృతీ ఫలితము. సంస్కృతీ సంపన్నులకు హృదయ వికాసములభించును. దివ్యభావతారకలు హృదయాంబరమున దళుకు లీనును. మానసిక నైర్మల్యముదయించును. స్వపర భేద తారతమ్య దృష్టి యంతరించును. సమత, వారిగుండెలలో పసిడిపూవుల ప్రభవింపజేయును. అంతట నానంద బ్రహ్మమునే వారు భావింపగలుగుదురు. అట్టి వారికే ఆత్మసాక్షాత్కార మగును. ఇదియే మతము.

రాత్రి వేలాది కన్నులను (నక్షత్రములను) గలిగియున్నది. పగలు ఒకేనయనమును (సూర్యుని) గలిగియున్నది. సూర్యుడస్తమించెనా. విశ్వమున కాంతియంతయు నస్తమించును. మనస్సు చాల కన్నులను (ఇంద్రియ వికారములను) గలిగియున్నది. హృదయమొకే నయనమును (ప్రేమమును) గలిగియున్నది. ప్రేమనశించెనా జీవితమునగల కాంతి యంతయు నశించును.

"దానందరిద్రాయ విభోః క్షమత్వమ్
యూనాం తపోజ్ఞానవతాంచ మౌనమ్
ఇచ్ఛానివృత్తిశ్చ శుభోచినామ్

దయాచ భూతేషు దివం నయంతి" అని గదా మన పెద్దల నిర్ణయము. నేటి మానవుని మనస్సు భౌతిక రంగమును విశేషముగ వికసింపజేసినది. కాని యీ బాహ్య విస్తరణము భారమై అంతఃకరణము నణచుచున్నది. ఆధ్యాత్మిక భావమును గప్పిపుచ్చుచున్నది. నశ్వరపదార్థ తత్త్వవివేకసిద్ధి - అనశ్వర మహామహిమాన్విత పరతత్త్వవివేకము నావరింప నుంకించుట శోచనీయాంశము.

భౌతికశాస్త్రము శక్తిని వికసింపజేసి కొంతవరకు మానవత్వమును వర్థిల్లజేసినను అహంకార మమకార ప్రాబల్యము లచే ఆశక్తి నను ష్ఠానమునకు దేజాలక పోయెను. పాశవిక శక్తులను భౌతికశాస్త్రము ప్రసవించుటచే మానవుని మానవునిగ,- దివ్యునిగ - గావింపజాలకున్నది. మన మనస్సులు, కార్యకలాపములు బాహ్యమునుండి అంతరంగమునకు - భౌతికమునుండి

ఆధ్యాత్మికమునకు - అసత్తునుండి సత్తునకు - కారుచీకటినుండి కాంతిలహరివైపునకు - మానవత్వమునుండి దేవత్వమువంకకు మరలనిచో మానవకళ్యాణముగాని విశ్వశాంతిగాని మనజాలవు. అట్టితటి మనమానందము ననుభవింప జాలము. వీనిని సాధించు శక్తి సామర్థ్యములను, పవిత్ర తేజమును ప్రసాదించు పరమ రసాయనము మతమే. ఇంద్రియభోగమే మానవజీవిత పరమ లక్ష్యమని పలుకుట ఇంగితజ్ఞానలోపమును వ్యక్తీకరించుచున్నది. తినుటలో కుక్కకున్నంత గాఢమగు సౌఖ్యము మానవున కుండదు. ఇంద్రియలోలతయందున్న దానికన్న మిన్నయగు సౌఖ్యము బుద్ధియందుగలదు. దీనికంటె మరియొక మెట్టుపై ప్రగాఢమైన యుత్కృష్టసౌఖ్యమున్నది. అదియే ఆత్మానందము. తార్కికదృష్టిని - బుద్ధినిదాటి దివ్యవిషయముల ననుభవించెడి ఆధ్యాత్మికానందమది. అది ఆత్మస్థాయియందేసాధ్యము. దానిని పొందుటకు సమస్తేంద్రియ భోగములకును మనము స్వస్తి చెప్ప వలెను. ఇది పరమోత్కృష్టమగు ప్రయోజనము. ఈ ఆనందము నిత్యసుఖదాయకము. భౌతికశాస్త్రమును మేము కాదనము. దానికొక యుచితస్థానము లేదనము. జీవితచరమాశయ సంసి ద్ధికి భౌతికశాస్త్రజ్ఞుల తోడ్పాటు కేవల నిమిత్త మాత్రము. ఆనంతజిజ్ఞాసతో, అఖండ సచ్చిదానందమును అనుభవయోగ్యము గావించుకొనన నేర్చిన మన తపస్వికులతిలకుల మహత్తరధీశక్తి యెక్కడ? నిరంతర పరిశ్రమలో మేధను వేధించి సాధించిన కొలది దానికే జగత్ప్రవక్తల శ్రేణికి జేరినట్లు సంబరపడెడి నేటి

భౌతికశాస్త్ర నిష్ణాతలెక్కడ? వీరి కృషికి మానవుల మనుగడలోగల స్థానము- వారితపస్సునకు విశ్వక్షేమమునగల స్థానము పరస్పరము పోల్చరానివి. మానవజీవిత సౌధమునకు భౌతిక శాస్త్రమే పునాదిరాయి యనుట సాహసమందుము. మానవ జీవితమున కది యొక్కటే పరమ ప్రయోజనకారి యనుట వివేకలక్షణముగాదందుము. జీవితలక్ష్యస్ఫూర్తినదిమూర్తీభవింప జేయుననుట పరిహాసాస్పదమందుము. సుస్థిరమును సుదృఢమును నగు మహోత్తమ స్థానముగల పవిత్రాలయము మతము. అది భౌతికశాస్త్రమును చితస్థానము నందిడును. క్రమవిధానమున ప్రయోజనకరముగ నొనర్చును. దేహపోషణమునకు, నిత్య జీవిత నిర్వాహణమునకు వలయు వస్తువులను నిర్మించు కొనుటకు భౌతికశాస్త్ర జ్ఞానమావశ్యకమే. దేహారోగ్యమును మానసిక నైర్మల్యమును జేకూర్చుటకు శాస్త్రజ్ఞానమెంతయు నావశ్యకమే. కాని నిత్యజీవితావసరములైన యీ పదార్థములను జీవకోటికి సముచితముగ బంచిపెట్టి అంతఃకరణ శౌచమును, హృదయార్ద్రతను జేకూర్చునది మతమే.

కాబట్టి త్యాగబుద్ధితో, నిష్కామముగ భౌతికసుఖముల ననుభవింపుము. పరుల ననుభవింపజేయుము. ఇది సక్రమమైన మానవజీవిత నిర్వహణము. అప్పుడే నిత్యసుఖము, నిత్య ఆనందము చేకూరును.

ఈశావాశ్యమిదగ్ం సర్వం
యత్కించ జగత్యాం జగత్
తేనత్య క్తేన భుంజీథా
మాగృధః కస్యస్విద్ధనమ్

మతమును బలిష్ఠములు - ఉన్నతోన్నతములునగు పునాదులపై నిడనిచో దాని కాంతి సర్వత్ర ప్రసరింపదు. భౌతిక శాస్త్రము వస్తూత్పత్తికి సహాకరింపగా, కొలదిమంది వానిని హస్తగత మొనర్చుకొని, తృష్ణను వర్ధిల్ల జేసికొను చున్నారు. స్వార్థపరులై పరులను నిర్దాక్షిణ్యముగ పీడించుచున్నారు. ఇట్టి వాతావరణమున నయశీల ప్రేమలకు నిలువ నీడ యుండదు. సమిష్టి కళ్యాణమునకు స్థానముండదు. స్వార్థము, భోగలాలసత, కామాకాంచనముల తుచ్ఛానుభవము, విశృంఖల స్వేచ్ఛా జీవితము మున్నగునవి సదా తాండవించును. ప్రపంచము నల్లకల్లోలములలో ముంచును, దుఃఖములను పెంచును. మానవులు శాంతి సుఖముల నాకాంక్షించుచో మానవజీవితమునేగాక దివ్యజీవితమును బడయు సంకల్పమును గలిగియుండవలెను. ప్రేయమును క్రమస్థానమునందిడి శ్రేయమునందించు మతము నుత్తమ స్థానము నందిడవలెను. దాని యాశ్రయము నీడన సర్వకార్య కలాపములను సాగింపవలెను.

ఉత్తమ స్త్రీ పురుషులులేని దేశమున శ్రేయో రాజ్యము మనజాలదు. చిత్తశుద్ధియు, శీలసంపత్తియులేని సమాజమున నుత్తమ స్త్రీ పురుషులుండజాలరు. నైతికములగు పునాదులు

లేనిదే శీలము వర్ధిల్లజాలదు. ఆధ్యాత్మిక చైతన్యములేనిదే నీతి దీపింపజాలదు. కాబట్టి జాతియొక్క సర్వతోముఖ వికాసమునకు మానవ కళ్యాణమునకు విశ్వశాంతికి – 'మతము – ఆధ్యాత్మిక శక్తి' జీవనాడులు.

వీనిని కేంద్రములుగ – అధిగమింపదగిన లక్ష్యములుగ నిడుకొని పయనము సాగింపని బ్రతుకులు భ్రష్టములగును. వీని పట్ల ననాదరణ భావమును జూపెడి సమాజములు పచ్చదనము మచ్చునకేని లేని బ్రమాకులగును. వీనిని బలిపుష్టముగావింప ప్రత్యేక శ్రద్ధవహింపని ప్రభుత్వపీఠములు ప్రజానీకమునకు నిజముగ ధర్మమును జేకూర్పలేని వగును.

వేయేల – సర్వము వికారముగ, వికటముగ పరివర్తన నొందును. కావుననే జాతీయ సర్వతో ముఖాభ్యుదయకాంక్షు లెల్లరు – ప్రగతి శీలమును భారతీయ వైఖరిలో బునరుద్దీపింప జేయ నపేక్షించు వారెల్లరు భౌతిక వాదమునకు నాధ్యాత్మిక వాదమునకు నడుమ సేతువై సమన్వయాత్మక సత్ఫలముల నొసగ నర్హమగు మన మతమును బరిరక్షింప, పరివర్ధింప, మనోవాక్కాయ కర్మల యత్నింతురుగాక.

సర్వమత శిరోభూషణమై – శాంతిప్రదమై – సనాతనమైన ఆర్ష మత దివ్యదీధితి మన మనః ఫలకముల ననవరతము ప్రతిఫలించు చుండుగాక !

సహనావవతు సహనౌభునక్తు
సహవీర్యం కరవామహై
తేజస్వినావధీతమస్తు
మావిద్విషావహై।

ఓం శాంతిః శాంతిః శాంతిః

Blank Page



తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, తిరుపతి. కా. 10,000.

36

చెడ్డవారిశక్తి చేటునకే కారణము

మూర్ఖత సకల వినాశకరము

ఇతరులను పరిహసింపరాదు

గొప్పవారితో స్పర్థపడరాదు

దీర్ఘవైరము కలవానికి కోపము కలిగింపరాదు

కృతఘ్నత మహాదోషము

కోపము కలవారితో సంబంధము అనర్థదాయకము

ఆపదలో ఆదుకొన్నవాడే ఆప్తుడు

తల్లిదండ్రులు, గురుదైవసమానులు

అన్నము పరమాత్మస్వరూపము; దానిని నిర్లక్ష్యము చేయరాదు

విద్యవలన వినయము, వినయమువలన పాత్రత, దానివలన మానవుడు ఇహపరసుఖములు పొందగలడు.



తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, తిరుపతి. కా. 10,000.

38

## Check List

| | | | |
|---|---|---|---|
| **Book Number** | CP035159 | **Date** | 2-7-20 |
| **Front Cover** | yes | **Back Cover** | yes |
| **Blank Pages** | iv, 35 | | |
| **Missing Pages** | NO | | |
| **Prepared** | | **Scanned** | Jasmin |
| **BOOK SIZE** | H - 7.2 W - 4.6 | **Pages** | 50 |